




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 16-7-2025

సంపుటి: 21 సంచిక: 97

పేజీలు: 8 వెల: రూ.1


## ఎన్నికలు మున్సిపాలిటీకి..

# కార్పొరేషన్లకు కాదు!



వినీన పంచాయతీలపై నారాయణకు వినతినిస్తున్న ఎన్ఈఆర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రవ్యాప్తంగా విలీన గ్రామాల సమస్యలు, కోర్టు కేసుల వల్ల ఎన్నికలు కాకుండా మిగిలిపోయిన 21 మున్సిపాలిటీలకు మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహిస్తామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ బుధవారం ప్రకటించిన తర్వాత శ్రీకాకుళం నగరంలో పండగ వాతావరణం నెలకొంది. వాస్తవానికి మంత్రి నారాయణ ప్రకటించింది కేవలం మున్సిపాలిటీ ఎన్నికల కోసం మాత్రమేనని గుర్తించాలి. రాష్ట్రవ్యాప్తంగా 21 మున్సిపాలిటీల్లోను, మూడు నగర కార్పొరేషన్లలోను నగర పంచాయతీలను విలీనం చేయడం వల్ల కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. ఇందులో మున్సిపాలిటీల వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు లేక అభివృద్ధి నిలిచిపోతుందని, ఇందుకు సంబంధించి కోర్టు కేసులు కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు నారాయణ ప్రకటించారు. ప్రభుత్వం తలచుకుంటే ఇది పెద్ద విషయం కాదు. కానీ కార్పొరేషన్ల విషయానికి వస్తే వీటిలో సమీప పంచాయతీలను కలిపి గత వైకాపా ప్రభుత్వం కరోనా సమయంలో ఆర్డినెన్స్ తీసుకువచ్చి, అక్కడికి 60 రోజుల తేడాలోనే చట్టాన్ని చేసింది. తమ పంచాయతీలు కార్పొరేషన్‌లో కలపడం అనైతికమంటూ ఓవైపు కోర్టుల్లో కేసులు నడుస్తుండగానే విలీన పంచాయతీలతో కలిపి కార్పొరేషన్ ఏర్పడినట్టు వైకాపా చట్టం తెచ్చింది. అందులో భాగంగానే రాష్ట్రంలో మూడు నగర కార్పొరేషన్లకు ఎన్నికలు నిలిచిపోయాయి. శ్రీకాకుళంలో అయితే 2010 తర్వాత ఇంతవరకు స్థానిక - మిగతా చివరి పేజీలో

# హుద్‌హుద్ ఇళ్లు హుష్ కాకి!

- కుందువానిపేట ఇళ్ల కేటాయింపులో భారీ అక్రమాలు
- ఏకంగా 65 ఇళ్లు ఎత్తుకుపోయిన ఒకే కుటుంబీకులు
- మాజీ సర్పంచ్ చేతివాటంతో అర్హులకు అన్యాయం
- ఆశ్రిత పక్షపాతానికి ఆమోదముద్ర వేసిన రెవెన్యూ, హౌసింగ్
- అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితులు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రెవెన్యూ శాఖ కళ్లు చేరేసింది.. హౌసింగ్ శాఖ ఆశ్రిత పక్షపాతానికి తెర లేపింది. ఇంకేముంది.. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక నాయకుడి కుటుంబానికి ఆ కాలనీలో ఏకంగా రెండొంతుల ఇళ్లు దఖలుపడ్డాయి. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ అధికారంలో లేనిది ఐదేళ్లు మాత్రమే. కానీ చాలా ఏళ్ల తర్వాత అధికారంలోకి వచ్చామని, ఇటువంటి సమయంలోనే ఇల్లు సర్దుకోవాలన్న కోణంలో కార్యకర్తలు వ్యవహరిస్తుండటం వల్ల ప్రస్తుత ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. ఉదయం లేచినప్పటి నుంచి అర్ధరాత్రి ఇంటికి చేరే వరకు ప్రారంభోత్సవాలు, ప్రజా గ్రీవెన్స్‌లు, సుపరిపాలనలో తొలి అడుగు, సమీక్షలతో బిజీగా గడిపేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్ ఎక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం కుందువానిపేటలో టీడీపీ నేత కుటుంబానికే 65 ఇళ్లు కేటాయించినా అసలు అర్హులెవరు? లబ్ధిదారులెవరు? అనేది తన కార్యాలయ సిబ్బంది అయినా దృష్టికి తీసుకొచ్చే పరిస్థితి లేకుండానే ఎమ్మెల్యే ప్రారంభోత్సవానికి వెళ్లారు. అప్పటి వరకు అట.. కదా అనే బోగట్టా కాస్త ఎమ్మెల్యే ప్రారంభించడంతో పక్కా అని తేలిపోయింది.

**ఇళ్లలో ఉన్నవారందరికీ..!**

2014లో సంభవించిన హుద్‌హుద్ తుపాను ధాటికి మత్స్యకార గ్రామమైన కుందువానిపేటలో కొన్ని ఇళ్లు అలల తాకిడికి కొట్టుకుపోయాయి. వాటి స్థానంలో మత్స్యకారులకు పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ మేరకు గ్రామంలో 288 ఇళ్లు నిర్మించారు. 2021లో వీటిలో 145 ఇళ్లు, 2022లో 72 ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించారు. ఇళ్ల కేటాయింపునకు అర్హులను గుర్తించడానికి అప్పట్లో రెవెన్యూ, హౌసింగ్ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ఒక ఇంటిలో ఎంతమంది ఉండేవారు? ఇప్పుడు ఎంతమందికి ఇళ్లు ఇవ్వాలి? అని గుర్తించి జాబితా తయారు చేశారు. ఆ మేరకు ఇళ్లు కేటాయించారు. ఈ తరుణంలోనే తమకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ 18 మంది ఇళ్లు తీసుకోలేదు. కాగా తెలుగుదేశం ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన 96 ఇళ్లకు లబ్ధిదారులను గుర్తించారని చెబుతున్నారు. వాస్తవానికి ఇందుకోసం రెవెన్యూ, హౌసింగ్ యంత్రాంగం ఎటువంటి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టలేదు. ఇదే అవకాశంగా ఆ



ప్రాంతంలో ఉన్న మాజీ సర్పంచ్, తెలుగుదేశం నేత.. తన కుటుంబ సభ్యులు, దగ్గర బంధువులకే 65 ఇళ్లు రాయించేశారు. గతంలో ఓ కుటుంబంలో నలుగురుంటే.. ఇద్దరికి హుద్‌హుద్ ఇళ్లు మంజూరు చేశారు. కానీ ఈ మాజీ సర్పంచ్ మాత్రం తన ఇంటిలోనూ, బంధువుల ఇళ్లలోనూ ఎంతమంది ఉంటే అందరి పేరునా ఇళ్లు ఇప్పించేశారు. మాజీ సర్పంచ్ సూరాడ అప్పన్నకు ముగ్గురు కొడుకులుండగా ముగ్గురికీ మూడిళ్లు కట్టబెట్టారని, ఇద్దరు మేనల్లుళ్లకు మరో రెండు ఇళ్లు, ఆయన తాతగారి ఇంటిలో ఐదుగురుంటే ఐదుళ్లు, మామగారింటిలో ముగ్గురుంటే మూడిళ్లు, వియ్యంకుడి ఇంటిలో ముగ్గురుంటే మరో మూడిళ్లు.. ఇలా తన బంధువర్గానికి మొత్తం 65 ఇళ్లు ఇప్పించుకున్నారు. ఇప్పుడు దీనిపైనే గ్రామంలో పెద్దఎత్తున అలజడి మొదలైంది. నిరుపేదలు, ఇప్పటికీ పక్కా నివాసం లేనివారికి అన్యాయం చేసి ఒకే కుటుంబానికి చెందినవారికి 65 ఇళ్లు కేటాయించడమేమిటని ప్రశ్నించడానికి బుధవారం గ్రామానికి చెందిన కొందరు యువకులతో పాటు బాధితులు స్థానిక 80 అడుగుల రోడ్డులో ఉన్న హౌసింగ్ శాఖాధికారులను కలవడానికి వెళ్లారు. నిబంధనల ప్రకారం రేషన్‌కార్డులో ఎంతమంది పేర్లు నమోదై ఉన్నాయి? అందులో ఎంతమంది ఒకే ఇంటిలో ఉంటున్నారన్న లెక్కల మేరకు ఇళ్లు కేటాయించాలి. అలా కాకుండా స్థానిక తెలుగుదేశం నాయకులకే ఈ పెద్దరికాన్ని కట్టబెట్టడం వల్ల ఒకే కుటుంబానికి 65 ఇళ్లు వెళ్లిపోయాయని వీరు ఫిర్యాదులో పేర్కొన్నారు. హౌసింగ్ పీడీని కలిసిన బాధితులు అనర్హుల జాబితాను అందజేస్తే, తమ కార్యాలయంలో వైకాపా నేతల ఇళ్ల జాబితా రద్దు ఫిర్యాదులు ఉన్నాయని, అయినా తాము పట్టాలు వెనక్కు తీసుకోడానికి సిద్ధంగా లేమంటూ వీరికి చెప్పినట్టు భోగట్టా. మరోవైపు హుద్‌హుద్ ఇళ్ల మంజూరు కోసం 400 మంది రూ.12వేలు చొప్పున తనకు ఇచ్చారంటూ మాజీ సర్పంచ్ బహిరంగంగానే ప్రకటించిన నేపథ్యంలో ఆయన చేతుల మీదుగా అర్హుల జాబితా తయారుచేయించి, ఎమ్మెల్యే పంపిణీ చేపట్టడం మీద గ్రామంలో అసంతృప్తి రేగుతుంది.



- -తల్లికి వందనం సొమ్మును వెనక్కిచ్చిన మాతృమూర్తి
- -పిల్లల చదువుకు ఇస్తున్నవి చాలు.. నగదు అక్కర్లేదు
- -దాన్ని పాఠశాల అభివృద్ధికి వెచ్చించాలని వినతి
- -ఆమె స్ఫూర్తిదాయక తీరుపై ప్రశంసల వర్షం
- -అభినందన సందేశం పంపిన విద్యాశాఖ మంత్రి లోకేష్



# ఓ తల్లీ.. వందనం!

**ప్రభుత్వం నుంచి ఏదో ఒక రూపంలో ఆర్థిక ప్రయోజనం లభిస్తుందంటే చాలు.. అర్హతలు, అవసరం ఉన్నవారితోపాటు డబ్బు ఉన్నవారు, ఉద్యోగులు సైతం ఆ ప్రయోజనాన్ని చేజిక్కించుకునేందుకు ఎగబడిపోతున్న కాలమిది. పథకం అందకపోతే ప్రభుత్వాన్ని, దాన్ని నడుపుతున్న పార్టీని నానారకాలుగా ఆడిపోసుకునే వ్యవస్థలో మనం ఉన్నాం. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం కింద రూ.13వేల ఆర్థిక ప్రయోజనాన్ని ఆ మధ్య పాఠశాల విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ఆ సొమ్ము అందని వారు ఇప్పటికీ దాని కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో ఆరా తీస్తున్నారు. తమకు ఎందుకు రాలేదని పలుచోట్ల అధికారులను నిలదీస్తున్న ఉదంతాలూ ఉన్నాయి. కానీ ఓ మాతృమూర్తి మాత్రం వీరికి భిన్నంగా వ్యవహరించి అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది. ప్రభుత్వం నుంచి తన ఖాతాలో జమ అయిన తల్లికి వందనం సొమ్ము రూ.13వేలు తనకు వద్దంటూ వెనక్కి ఇచ్చేసింది. అమె అలా తిరస్కరించడానికి రాజకీయ కారణాలో.. ఇంకేదో కాదు! తన బిడ్డను చదివించుకునే స్తోమత తనకు ఉన్నందున ఆ సొమ్మును వెనక్కి ఇచ్చేస్తున్నానని ఆమె చెప్పడం కచ్చితంగా ఎందరికో కనువిప్పు అవుతుంది.. ఆదర్శంగా నిలుస్తుంది.**




(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

ఆమె సాధారణ గృహిణి. పేరు శోభారాణి. స్వగ్రామం గార మండలం కె.మత్స్యలేశం. ఆమెకు ఇద్దరు కుమారులు. వారు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో చదువుతున్నారు. చిన్న కుమారుడు ఎల్‌కేజీ చదువుతుండటంతో ఆ అబ్బాయికి తల్లికి వందనం మంజూరు కాలేదు. పెద్దవాడైన మరో కుమారుడికి మాత్రం పథకం మంజూరు కాగా ఇటీవల అందరితోపాటు ఆ సొమ్ము రూ.13 వేలు ఆ బాలుడి తల్లి శోభారాణి బ్యాంకు అకౌంట్‌లో జమ అయ్యింది. అయితే ఆమె ఆ సొమ్ములో ఒక్కపైసా అయినా తీసుకోకుండా.. ఆ మొత్తాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడి తిరిగి ఇచ్చేశారు. అంతేకాకుండా ప్రభుత్వం ఇచ్చిన మొత్తానికి మరో రెండువేలు కలిపి.. రూ.15 వేలు ఇవ్వడం విశేషం. దాంతో ప్రధానోపాధ్యాయుడు సుధీర్‌కుమార్ శోభారాణిని పిలిపించి.. ఎందుకు ఇలా చేశారని అడిగారు. దానికి ఆమె చెప్పిన సమాధానం ఆయన్ను అబ్బురపర్చింది.

**అవి ఇస్తున్నారు చాలు..**

సాధారణంగా ప్రభుత్వం ఎంత ఇచ్చినా.. ఇంకా ఏదో చేయలేదన్న అసంతృప్తి ప్రజల్లో కనిపిస్తుంటుంది. కానీ శోభారాణి దానికి భిన్నంగా ఆలోచించింది. ప్రభుత్వం ఇచ్చిన రూ.13 వేలు వెనక్కి ఇచ్చేయడానికి కారణాలు చెబుతూ ఆమె పాఠశాల ప్రధానోపాధ్యాయుడి వద్ద చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. 'మా కుమారుడి చదువుకు ప్రభుత్వం బట్టలు, బూట్లు, పాఠ్య నోట్ పుస్తకాలు, బ్యాగు తదితర సరంజామా ఇవ్వడంతోపాటు రోజూ మధ్యాహ్నం భోజనం కూడా పెడుతోంది. ఇక నాకు డబ్బుతో అవసరం ఏముంటుంది? రెండోపూట నా కొడుకును పోషించుకునే బాధ్యత మాదే. ఉపాధ్యాయులు మా పిల్లలకు మంచి చదువులు చెబితే చాలు.. మాకు ఇంకేమీ అవసరం లేదు' అని ఆమె చెప్పిన వివరణ ప్రధానోపాధ్యాయుడిని విభ్రమకు గురిచేసింది. ప్రభుత్వం ఇచ్చిన సొమ్ము తిరిగి ఇవ్వడం సరే.. కానీ దానికి అదనంగా రూ.రెండు వేలు ఎందుకు ఇచ్చారు' అని ఆయన ప్రశ్నించగా పాఠశాల అభివృద్ధికి తన వంతుగా ఇచ్చానని.. ఆ మొత్తం రూ.15 వేలను అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని ఆమె కోరింది.

**ఆమె ఓ స్ఫూర్తి జ్యోతి**

దీనిపై ప్రధానోపాధ్యాయుడు సుధీర్ స్పందిస్తూ శోభారాతిని స్ఫూర్తి జ్యోతిగా అభివర్ణించారు. తల్లిదండ్రులందరూ ఇలాగే ఆలోచిస్తే విద్యా వ్యవస్థ ఆకాశమంత ఎత్తుకు ఎదుగుతుందన్నారు. ఇటీవల జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆమె ఈ సొమ్మును వెనక్కి ఇచ్చారన్నారు. ఆమె చర్య మిగిలినవారికి ఆదర్శంగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. కే.మత్స్యలేశం పూర్తిగా మత్స్యకార గ్రామమని ఇక్కడి వారిలో అధికశాతం వెనుకబడినవారేనని చెప్పారు. వారిలోనే స్ఫూర్తిదాతలు ఉండటం విశేషమని కొనియాడారు. మోడల్ స్కూల్ తరహాలో నడుపుతున్న ఈ పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి తరగతులు ఉన్నాయని చెప్పారు. తల్లిదండ్రులందరూ ఇదే తరహాలో ఆలోచిస్తే విద్యారంగం కొత్త వెలుగు సంతరించుకుంటుందన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పలువురు శోభారాణిని ప్రశంసిస్తున్నారు. కాగా చైల్డ్ రైట్స్ సంస్థ ప్రతినిధులు ఆమెను స్వయంగా అభినందించి, సత్కరించారు. కాగా శోభారాణి తల్లికి వందనం సొమ్మును తిరిగి ఇచ్చేయడం, దానికి ఆమె చెప్పిన కారణం గురించి విద్యాశాఖ మంత్రి లోకేష్ వరకు వెళ్లింది. దాంతో ఆయన స్పందించి ఆమెను అభినందిస్తూ ప్రత్యేకంగా సందేశం పంపించారు.

• ఎడిటోరియల్

# బీసీ రిజర్వేషన్ల రాజకీయం!

బీసీ రిజర్వేషన్ల అంశం ఎప్పటికప్పుడు చర్చనీయాంశం అవుతూనే ఉంది. జనాభాలో సగానికి పైగా ఉన్న వెనుకబడిన తరగతుల(బీసీ)కు ఆ దామాషా పద్ధతిలో విద్య, ఉద్యోగాలు కేటాయించాల్సి ఉండగా అలా జరగడంలేదని ఆ వర్గాల దీర్ఘకాల ఆరోపణ.. పోరాటం. కానీ దురదృష్టవశాత్తు రాజకీయ అంశంగా మారపోతూ ఎప్పటికప్పుడు ఆ ప్రయత్నాలు నీరుగారిపోతున్నాయి. మన దాయాది తెలుగు రాష్ట్రం తెలంగాణలో ప్రస్తుతం అలాంటి రాజకీయమే నడుస్తోంది. ఆ రాష్ట్రంలో కోర్టు తీర్పు ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్ చివరిలోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ తరుణంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ బీసీ రిజర్వేషన్లను తెరపైకి తీసుకొచ్చారు. ఏకంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించారు. ఆ మేరకు ఆర్డినెన్స్ రూపొందించి ఇటీవలి మంత్రివర్గ సమావేశంలో దాన్ని ఆమోదముద్ర వేయించారు. తుది ఆమోదం కోసం రాష్ట్ర గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపింది. అక్కడ రాజముద్ర పడగానే సదరు ఆర్డినెన్స్‌పై గెజిట్ నోటిఫికేషన్ జారీ అవుతుంది. రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. కానీ దాన్ని కేంద్ర ప్రభుత్వం పెండింగులో పెట్టినట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం 22 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను అమాంతంగా 42 శాతానికి పెంచేయడం ఆ వర్గాలకు ఆమోదయోగ్యమే కాకపోతే దానికి అనుసరించిన పద్ధతి, న్యాయపరంగా వాటి చెల్లుబాటుపైనే అనుమానాలు, విమర్శలు వినిపిస్తున్నాయి. దీని వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ ప్రయోజనాలే కనిపిస్తున్నాయి. గవర్నర్ ఆమోదం పొంది ఈ ఆర్డినెన్స్ అమల్లోకి వస్తే రెండు నెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు పెరుగుతాయి. దాంతో బీసీ ఓట్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కు లభిస్తాయన్నది నిర్వివాదాంశం. ఒకవేళ ఏ కారణం చేతనైనా కేంద్రం దీన్ని ఆమోదించకపోయినా లేదా ఎవరైనా ఈ ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ కోర్టులను ఆశ్రయించినా కూడా కాంగ్రెస్ పార్టీకే మైలేజీ లభిస్తుంది. ఈ కారణాలతో ఆర్డినెన్స్ అమలుకు నోచుకోకపోతే స్థానిక ఎన్నికల ప్రచారానికి వజ్రాయుధం లభించినట్లే. వాస్తవానికి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఈ హామీనే ప్రచారాస్త్రంగా చేసుకుంది. కాంగ్రెస్‌ను గెలిపించి అధికారంలోకి తెస్తే బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని అప్పట్లో ఆ పార్టీ వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర వరకు ఆ హామీని పెద్దగా పట్టించుకోని సీఎం రేవంత్‌రెడ్డి కోర్టు తీర్పుతో స్థానిక ఎన్నికలు నిర్వహించక తప్పని పరిస్థితుల్లో బీసీ రిజర్వేషన్ల హామీని ఉన్నఫళంగా తెరపైకి తెచ్చి.. అదీ రాజ్యాంగబద్ధంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం పొందకుండా ఆర్డినెన్స్ రూపంలో తేవడం ద్వారా తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ సందర్భంగా ఒక విషయం గమనార్హం. కేసీఆర్ హయాంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు ప్రయత్నించి విఫలమైంది. 22 శాతంగా ఉన్న ఈ వర్గాల రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. అయితే కోర్టు దాన్ని తిరస్కరించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను కొట్టివేయడంతో బీసీ రిజర్వేషన్లు మళ్లీ 22 శాతానికే పరిమితమయ్యాయి. మరో న్యాయపరమైన అంశం ఏమిటంటే.. విద్య, ఉద్యోగ, రాజకీయపరమైన రిజర్వేషన్లు మొత్తం కలిపి 50 శాతానికి మించకూడదని గతంలోనే సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చింది. దేశ న్యాయవ్యవస్థ మొత్తం ఆ రూలింగ్‌నే ప్రామాణికంగా తీసుకుని ఇటువంటి కేసుల్లో నిర్ణయాలు తీసుకుంటోంది. గతంలో పలు రాష్ట్రాలు ముస్లింలు, ఇతర వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన నిర్ణయాలను ఈ రూలింగ్ ఆధారంగానే న్యాయస్థానాలు తిరస్కరించాయి. ప్రసుతం తెలంగాణలో రిజర్వేషన్ల కోటా స్ట్రక్చర్ పరిశీలిస్తే.. ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 22 శాతం.. అంటే సరిగ్గా 50 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినట్లు బీసీ రిజర్వేషన్లు 22 నుంచి 42 శాతంగా అమలైతే.. మొత్తం రిజర్వేషన్లు 70 శాతానికి ఎగబాకుతాయి. అంటే తెలంగాణ జనాభాలోని మిగిలిన అన్ని వర్గాలకు కలిపి 30 శాతం సీట్లే దక్కుతాయి. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కోర్టులు అంగీకరించే పరిస్థితి లేదు. కానీ కాంగ్రెస్ సర్కారుకు మాత్రం కావలసిన రాజకీయ ప్రయోజనం మాత్రం సిద్ధిస్తుంది. మా ప్రయత్నం మేం చేశాం.. బీసీ రిజర్వేషన్లు పెంచాలన్నదే మా తాపత్రయం.. కానీ అడ్డుకోవడానికి కొందరు కోర్టుకు వెళ్లారు. కోర్టు నిలిపివేసింది'.. అంటూ రాజకీయ ప్రత్యర్థులు, కోర్టులపైకి నెపాన్ని నెట్టివేసి ప్రయోజనం పొందే అవకాశం కాంగ్రెస్‌కు లభిస్తుంది. ఇదే మరి రాజకీయమంటే!

## కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం



(సత్యంన్యూస్, నరసన్నపేట)

నరసన్నపేటకు చెందిన రఘుపాత్రుని శేఖర్ అనే కిడ్నీ వ్యాధి బాధితునికి జిల్లా శిష్టకరణ సేవాసంఘం తరపున ఆర్థిక సహాయంగా రూ.82వేలు అందజేశారు. జిల్లా సంఘం అధ్యక్షులు డబ్బీరు శ్రీనివాసరావు (వాసు) ఆధ్వర్యంలో బుధవారం బాధితుడు శేఖర్ భార్య సుజాతకు నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘం నేతలు ఎస్‌వీడీ మురళి, ఆర్‌వీఎన్ శర్మ, బలివాడ శివప్రసాద్, నందిగాం కైలాశ్వరరావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్‌ను కలిసిన ఎంజీఆర్

(సత్యంన్యూస్, పాతపట్నం)

రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లి లోని ఆయన నివాసంలో బుధవారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవింద రావు కలిశారు. ఈ సందర్భంగా పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధి చెందేందుకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నియోజకవర్గంలో బీసీ, సాంఘిక సంక్షేమ వసతి గృహాలను మంజూరు చేయాలని అదేవిధంగా పాలిటెక్నికల్ కళాశాల మంజూరు వేగవంతం చేయాలని విన్నవించారు ఎమ్మెల్యే వినతులను స్వీకరించిన లోకేష్ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు.





మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నాయకులు ధర్మాన ప్రసాదరావును ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం బొడ్డేపల్లి రమేష్‌కుమార్‌ను ధర్మాన ప్రసాదరావు సన్మానించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం.**

## ఆర్ఎస్ఎస్ విధానం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారత రాజ్యాంగ పీఠిక నుండి సెక్యులరిజం, సోషలిజం పదాలను తొలగించాలని ఆర్.ఎస్. ఎస్ డిమాండ్ చేయడం, భారత ప్రజలందరకు శిరోధార్యమైన రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు కవి, వాగ్గేయ కారుడు గరిమెళ్ళ సత్యనారాయణ, గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ వి.జి.కె మూర్తి జయంతుల సందర్భంగా గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో "భారత రాజ్యాంగానికి ఎదురవుతున్న తాజా సవాళ్లు ప్రజాస్వామ్య మనుగడపై ప్రభావం" అనే అంశంపై మంగళవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయసమావేశ మందిరంలో జరిగిన సెమినార్‌లో ఆయన ప్రధానవక్తగా పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో రూపొందిన భారత రాజ్యాంగం అనేక సవాళ్ళను ఎదుర్కొని భారత దేశాన్ని లౌకిక ప్రజాస్వామ్య దేశంగా నిలిపిందని, భవిష్యత్తులో ప్రజలందరూ మరింత చైతన్యవంతంగా మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే హక్కు ఎవరికీ లేదన్నారు. ముందుగా గరిమెళ్ళ సత్యనారాయణ, వీజీకే మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్రోద్యమానికి గరిమెళ్ళ అందించిన సేవలను, ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేశారు. గరిమెళ్ళ పేరుతో విజ్ఞానకేంద్రాన్ని స్థాపించి తద్వారా సమకాలీన అంశాలపై ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలతో నిరంతరం ప్రజల మనిషిగా వి.జి.కె మూర్తి నిలిచారని, ఆయన ఆశయసాధనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డైట్ కాలేజ్ ప్రిన్సిపల్ కొత్తకోట అప్పారావు, గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం సహాయ కార్యదర్శి పి.సుధాకరరావు, కె.ఎస్.రామకృష్ణ, చింతాడ రామచంద్రరావు, గరిమెళ్ళ విజ్ఞానకేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, జి.సతీష్ కుమార్, కె.ఎస్.ఎన్ మూర్తి, పి.వి.రమణమూర్తి, జె. భీమ శంకరరావు, జె. ఎస్. ఎస్.ప్రకాశ్ రావు, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు గారు, జానవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు గొంటి గిరిధర్ గారు, వీజీకే మూర్తి గారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వీధి విక్రయదారులను కార్మికులుగా గుర్తించండి

(సత్యంన్యూస్, టెక్కలి)

పండ్లు, కాయగూరలు అమ్ముకునే బ్రతికే వీధి విక్రయదారులను కార్మికులుగా గుర్తించి ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ కార్యక్రమాలు అమలుపర్చాలని సిఐటియు నాయకులు కొల్లి యల్లయ్య, నంబూరు షణ్ముఖరావులు డిమాండ్ చేశారు. టెక్కలి పట్టణంలో ఫుట్‌పాత్ వర్కర్స్ అయిన తోపుడు బళ్లు కార్మికుల సంఘం సమావేశం సిఐటియు కార్యాలయంలో ఉర్జాన మాధవరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ట్రాఫిక్ నిబంధనలు చూపి రోడ్ ప్రక్కన జరిగే వ్యాపారం పోయిందని, వీధి విక్రయదారులుగా బ్రతికే తమకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం లభించడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలతోపాటు విద్యుత్ చార్జీలు పెరిగిపోయాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నా పూర్తిస్థాయిలో వైద్యం లభించడం లేదన్నారు. గ్రామ పంచాయతీ నుండి కూడా ఎటువంటి సహాయం లభించడం లేదన్నారు. యూనియన్ సభ్యులు చందాలతో కొద్ది మేరకు కార్మికుల సంక్షేమం చూస్తున్నారన్నారు. ఐక్యతతో మరింత సంఘ బలాన్ని పెంచుకుందామన్నారు. కార్యక్రమంలో యల్.వరదరాజు, యు.మాదవరావు, షిల్లా క్రిష్ణమూర్తి, బి.తారకేశ్వరరావు, గిన్ని శ్రీను, యు.రామారావు, జె.మల్లేశ్వరరావు, డి.లవ తదితరులు పాల్గొన్నారు.



## సినిమా బడ్జెట్ 4 వేల కోట్లా..
# హాలీవుడ్‌ని టచ్ చేశాంగా!



భారతీయ సినిమా ఎల్లలు దాటేసింది. ప్రపంచం మొత్తం చుట్టేస్తోంది. దాంతో పాటు బడ్జెట్ల బౌండరీల గేట్లు కూడా కూలద్రోసి ముందుకు వెళ్లిపోతోంది. ఇది వరకు వంద కోట్ల సినిమా అంటే 'వామ్మో' అనుకొనేవారంతా. ఇప్పుడు ఆ వంద వెయ్యి అయ్యింది.


బాలీవుడ్‌లో ఓ సినిమా ఏకంగా రూ.4 వేల కోట్లతో తెరకెక్కిస్తున్నారు. అదీ ఇండియన్ సినిమా సాధించిన ఘనత. బాలీవుడ్‌లో రూపొందుతున్న 'రామాయణ' కోసం నాలుగువేల కోట్ల బడ్జెట్ అవుతోందని నిర్మాత నమిత్ మల్హోత్రా ప్రకటించారు. ఆయన స్టేట్‌మెంట్ తో ఒక్కసారిగా భారతీయ చలన చిత్ర పరిశ్రమ ఉలిక్కిపడింది. ఇది కనీ వినీ ఎవరుగని అంకెలు.. ఇది వరకు చూడలేని, భవిష్యత్తులో చూస్తామో లేదో తెలియని బడ్జెట్. 'రామాయణ' ముందు నుంచీ హాట్ టాపిక్కే. ఈ సినిమా బడ్జెట్ దాదాపుగా 2 వేల 500 కోట్లని అప్పట్లో వార్తలొచ్చాయి. ఆ అంకెలకే చాలామంది ఆశ్చర్యపోయారు. ఇప్పుడు బడ్జెట్ 4 వేల కోట్లు అనేసరికి మరింత షాక్‌కి గురవుతున్నారు. భారతీయ సినిమా స్టామినా 2వేల కోట్లు. అంటే దానికి రెట్టింపు పెట్టుబడి పెడుతున్నారన్నమాట. కాకపోతే.. రామాయణ రెండు భాగాలుగా తీస్తున్నారు. ఒక్కో పార్ట్ కీ 2 వేల కోట్లు అనుకోవొచ్చు.

రామాయణం లాంటి ఇతిహాస గాథలకు ప్రేక్షకుల్ని థియేటర్లకు రప్పించే సత్తా ఉందని, ఈ సినిమా భాషలకు అతీతంగా ప్రపంచమంతా చూస్తారని దర్శక నిర్మాతలు గట్టిగా నమ్ముతున్నారు.

రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్న సినిమా ఇది. యష్ రావణాసురిడిగా కనిపించబోతున్నారు. సన్నీడియోల్, లారా దత్తా, రకుల్ ప్రీత్ సింగ్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. వీళ్లు కాకుండా కొంతమంది ప్రముఖ హీరోలు అతిథి పాత్రల్లో దర్శనమిస్తారని తెలుస్తోంది. ఎంతైనా 4 వేల కోట్ల బడ్జెట్ ఇది.. దాదాపుగా హాలీవుడ్‌ని టచ్ చేశాం. ఈ రిస్క్ గనుక తగిన ప్రతిఫలం అందిస్తే, హాలీవుడ్ కూడా విస్తుపోయే బడ్జెట్లతో భారతీయ సినిమా ముందుకు దూసుకుపోవడం ఖాయం.

**- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...**

# త్రిప్తీ రేంజ్ పెరుగుతోంది!!



**యానిమల్ చిత్రంతో ఓవర్‌నైట్ స్టార్‌గా ఆవిర్భవించింది త్రిప్తి దిమ్రీ. కేవలం కొన్ని నిమిషాల పాటు కనిపించే పాత్రలో నటించినా తనదైన ప్రభావం చూపడంలో త్రిప్తి పెద్ద సక్సెసైంది. రణబీర్ కపూర్ తో ఘాటైన రొమాన్స్ పండించే గ్లామరస్ బ్యూటీగా యువతరం హృదయాలను దోచుకుంది.**

ఈ సినిమాతో వచ్చిన హైప్ కారణంగా, ఆ తర్వాత పారితోషి కాన్ని అమాంతం పెంచేసిన త్రిప్తి, వరుస చిత్రాలకు సంతకాలు చేసింది. ఇప్పటికిప్పుడు ప్రభాస్, హృతిక్, షాహిద్ కపూర్ లాంటి స్టార్ల సరసన నటించేస్తోంది ఈ బ్యూటీ. ప్రభాస్ సరసన సందీప్ రెడ్డి వంగా 'స్పిరిట్' మూవీలో త్రిప్తికి అవకాశం కల్పించడం అందరినీ ఆశ్చర్య పరిచింది. త్రిప్తికి అంత సీన్ ఉందా? ఆ రేంజ్ హీరోయినా? అంటూ కొందరు విమర్శించారు. దీపిక పదుకొనేతో వ్యవహారం చెడిండి గనుకనే వెంటనే ప్రెస్టేజ్ కోసం సందీప్ వంగా త్రిప్తీని లైన్ లోకి తీసుకు వచ్చాడని భావించేవారు లేకపోలేదు. అయితే ఈ ప్రాజెక్ట్ తర్వాత త్రిప్తి హృతిక్ రోషన్ సరసనా నటిస్తోంది అంటూ బాలీవుడ్ మీడియాలు కథనాలు వండి వార్చాయి. ఇది కూడా షాకిచ్చే విషయమే. హృతిక్ వార్-2 చిత్రీకరణను పూర్తి చేసుకుని, తదుపరి క్రిష్-4 కోసం సిద్ధమవుతున్నాడు. ఇలాంటి సమయంలో త్రిప్తికి అవకాశం అంటే అది కచ్చితంగా క్రిష్-4లో ఛాన్సివ్వడమేనని భావిస్తున్నారు. కానీ తాజాగా రిలీజైన వీడియో వివరాల ప్రకారం... హృతిక్- త్రిప్తి జంట హెచ్‌ఆర్ఎక్స్ కోసం జతకట్టారు. హృతిక్ రోషన్ బ్రాండ్ అంబాసిడర్ గా విస్తరించిన సొంత లేబుల్ హెచ్‌ఆర్ఎక్స్ ఇప్పటికే యువతరంలో గొప్పగా పాపులరైంది. తాజాగా రిలీజ్ చేసిన వీడియో ఒక వాణిజ్య ప్రకటన చిత్రీకరణ కోసం అని అర్థమవుతోంది. హృతిక్ రోషన్ - ఎక్సీడ్ ఎంటర్‌టైన్‌మెంట్ సహ యాజమాన్యంలోని హెచ్‌ఆర్ఎక్స్, దుస్తులు, పాదరక్షలు, ఉపకరణాలు వంటి ఫిట్‌నెస్, జీవనశైలి ప్రొడక్ట్స్ ని విక్రయించే ఆన్ లైన్ ప్లాట్ ఫామ్. 2013లో ప్రారంభమైంది. ఈ బ్రాండ్ ఫిట్‌నెస్ గోల్స్ ని దృష్టిలో ఉంచుకుని రిలీజ్ చేయగా, అది యువతరాన్ని గొప్పగా ఆకర్షిస్తోంది. త్రిప్తి దిమ్రి కెరీర్ మ్యాటర్ కి వస్తే.. తదుపరి సిద్ధాంత్ చతుర్వేది సరసన నటించిన రొమాంటిక్ డ్రామా ధడక్ 2 విడుదలకు సిద్ధమవుతోంది. షాజియా ఇక్బాల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 1న థియేటర్లలోకి రానుంది. షాహిద్ కపూర్ సరసన అర్జున్ ఉస్తారాలోను నటిస్తోంది. విశాల్ భరద్వాజ్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో**

# 2 గంటల 42 నిమిషాల వీరమల్లు

పవన్ నటించిన హరి హర వీర మల్లు ఈనెల 24న విడుదలకు సిద్ధమైన సంగతి తెలిసిందే. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి యూ బై ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. నిడివి దాదాపుగా 2 గంటల 42 నిమిషాలు అని తెలుస్తోంది. సెన్సార్ రిపోర్ట్ పవన్ ఫ్యాన్స్‌ని ఖుషీ చేసేలానే ఉంది. ఫస్టాఫ్ చాలా బాగుందని, ముఖ్యంగా ఇంట్రవెల్ బ్యాంగ్ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్‌కు ఫీస్ట్‌లా ఉంటుందని తెలుస్తోంది. పవన్ కల్యాణ్ ఇంట్రడక్షన్ సీన్ కూడా కొత్తగా డిజైన్ చేశారని సమాచారం. ఈ సినిమాని రెండు భాగాలుగా విడగొట్టిన సంగతి తెలిసిందే. పార్ట్ 2కి లీడ్ చాలా పర్‌ఫెక్ట్‌గా కుదిరిందని, కథ అసంపూర్ణమైనా సంతృప్తికరమైన ముగింపే ఆశించొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఎక్కడ చేయాలి? అనే విషయంపై చిత్రబృందం కసరత్తులు చేస్తోంది. విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం ఇలా చాలా పేర్లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే వీరమల్లు ట్రైలర్ ఈ సినిమాపై అంచనాల్ని మరింత పెంచేసింది. **- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...**





“ఖతార్‌కు చెందిన ఓ వృద్ధుడికి తన చిన్నతనంలో భారతీయులంటే ఎంతో క్రేజ్ ఉండేది. అదే సమయంలో కోపం కూడా. తానెప్పుడూ చూడని ఓ ఆరెంజ్‌ను భారత అధికారి నుంచి దొంగలించినందుకు తనను కొట్టారని ఆ కోపం. పెరిగి పెద్దయ్యాకా ఆ కోపం కొనసాగింది. కానీ కొన్నేళ్ల తర్వాత ఒకప్పుడు తాను క్రేజీగా భావించిన భారతీయులు, కార్మికుల్లా గల్ఫ్ దేశాలకు వస్తుండడం చూసి ఆ కోపం చల్లారింది.”



# దుబాయి.. ఒకప్పుడు భారత సామ్రాజ్యంలో భాగమని తెలుసా?



ద టైమ్స్ ప్రతినిధి డేవిడ్ హోల్డన్ 1956 చలికాలంలో బహ్రెయిన్ ఐలాండ్ వెళ్లారు. అప్పటికి అదింకా బ్రిటిష్ నియంత్రణలోనే ఉంది. కొంతకాలం జాగ్రఫీ టీచర్‌గా పనిచేసిన హోల్డన్, కొత్త ఉద్యోగంపై గల్ఫ్‌కు వెళ్లారు. తాను చేయబోయే ఆ కొత్త ఉద్యోగంపై ఆయన చాలా ఆసక్తిగా ఉన్నారు. అయితే, గల్ఫ్‌లో దుబాయి, అబుదాబి, ఒమన్ వంటి ఏ ప్రాంతాలకు వెళ్లినా అక్కడ ఆయనకు ‘బ్రిటిష్ ఇండియా’ తాలూకు గుర్తులు కనిపించేవి. బ్రిటిష్ ఇండియా ప్రభావం ఊహించని రీతిలో గల్ఫ్‌పై ఉందని హోల్డన్ రాశారు.

‘అనేక అసాధారణ విషయాలు, ఈ కాలానికి చెందని సంప్రదాయాలతో గల్ఫ్ నిండిపోయింది. పని మనుషులను బేరర్లు అని, చాకలివాళ్లను ధోబీ అని, వాచ్‌మెన్‌ను చౌకీదార్ అని పిలుస్తారు. ఆదివారాలు అతిథులకు అనేక రకాల కూరలతో మధ్యాహ్న భోజనం తయారుచేస్తారు. ఇది బ్రిటిష్ ఇండియా సంప్రదాయం’ అని హోల్డన్ రాశారు.

రాజస్థాన్‌లో చదువుకున్న ఒమన్ సుల్తాన్‌కు అరబిక్ కన్నా ఉర్దూపై ఎక్కువ పట్టుంది. ఇప్పుడు తూర్పు యెమెన్ అయిన క్వైటీలో సైనికులు, వాడుకలో లేని హైదరాబాదీ ఆర్మీ యూనిఫాంలతో మార్చ్ నిర్వహించారు. ఒక సందర్భంలో ఏడెన్ గవర్నర్ కూడా ‘ఇక్కడి పరిస్థితులను చూస్తే.. కాలం 70 ఏళ్ల క్రితం ఆగిపోయినట్టు అనిపిస్తుంది. బ్రిటిష్ రాజ్యం అత్యున్నత స్థాయిలో ఉన్న సమయం. క్వీన్ విక్టోరియా పరిపాలన, గిల్బర్ట్, సులివాన్ మ్యూజిక్ కొత్తగా, ఉత్తేజకరంగా ఉంది. దిల్లీ నుంచి హైదరాబాద్ ద్వారా దక్షిణ అరేబియా తీరానికి సంబంధం చాలా బలంగా ఉంది’ అని ఏడెన్ గవర్నర్ చెప్పారు.

## బ్రిటిష్ ఇండియాలో సంస్థానాల వరస క్రమం అబుదాబీతో మొదలు

ఇప్పుడు ఎవరికీ గుర్తులేకపోయినప్పటికీ 20వ శతాబ్దం ప్రారంభంలో అరేబియా ద్వీపకల్పంలో దాదాపు మూడింట ఒక వంతు బ్రిటిష్ ఇండియా సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. ఏడెన్ నుంచి కువైట్ వరకు, అరేబియా ప్రాంతాల సమూహపు పాలన దిల్లీ నుంచి సాగేది. భారత రాజకీయ విభాగం అక్కడి రాజకీయాలను పర్యవేక్షించేది. భారత బలగాలు భద్రత కల్పించేవి. వారంతా భారత వైస్రాయ్‌కు జవాబుదారీగా ఉండేవారు.

1889 ఇంటర్‌ప్రిటేషన్ యాక్ట్ ప్రకారం, ఈ ప్రాంతాలన్నీ చట్టపరంగా భారత్‌లో భాగంగా పరిగణించేవారు. జైపూర్ వంటి భారత రాజసంస్థానాల జాబితా అక్షర క్రమంలో అబుదాబితో ప్రారంభమయ్యేది. ఒమన్‌ను ‘లస్ బేలా లేదా కెలాట్ (ప్రస్తుత బలూచిస్తాన్) లాంటి భారత సామ్రాజ్యంలోని స్థానిక రాష్ట్రంగా’ పరిగణించాలని కూడా వైస్రాయ్ లార్డ్ కర్జన్ సూచించారు. భారత పాస్‌పోర్టులు యెమెన్‌లోని ఏడెన్ వరకు జారీ చేసేవారు. ఇది భారతదేశం పశ్చిమ రేవుగా ఉండేది. బొంబాయి ప్రావిన్స్‌లో భాగంగా పరిపాలన సాగేది. 1931లో మహాత్మాగాంధీ ఆ నగరాన్ని సందర్శించినప్పుడు, చాలామంది యువ అరబ్బులు తమను భారత జాతీయవాదులుగా భావించుకుంటున్నట్టు గుర్తించారు.

### భారత్ నుంచి విడిపోయిన ఏడెన్

హోల్డన్ పర్యటన సాగే సమయానికి బ్రిటిషర్లు, భారతీయుల్లో చాలా మందికి బ్రిటిష్ ఇండియాలో గల్ఫ్ దేశాలు భాగమన్న విషయం తెలుసు. అయితే భారత సామ్రాజ్యం మొత్తం పరిధి చూపించే మ్యాప్‌లను అత్యంత రహస్యంగా ఉంచారు. ఆనాటి ఓటోమన్‌లను, ప్రస్తుత సౌదీలకు ఆగ్రహం కలగకుండా అందరికీ కనిపించే ప్రభుత్వ డాక్యుమెంట్లలో అరేబియా భూభాగాలను ప్రచురించేవారు కాదు. ‘అసూయాపరుడైన షేక్ తన ప్రియమైన భార్యకు ముసుగు వేసినట్టే, బ్రిటిష్ అధికారులు అరబ్ దేశాల పరిస్థితులను చాలా రహస్యంగా కప్పివేసి ఉంచేవారు’ అని రాయల్ ఆసియాటిక్ సొసైటీలో పని చేసే ఒక లెక్చరర్ అన్నారు.

1920ల నాటికి, రాజకీయాలు మారిపోయాయి. భారత జాతీయవాదులు భారతదేశాన్ని సామ్రాజ్య నిర్మాణంగా కాకుండా, మహాభారత భౌగోళిక సంస్కృతిగా భావించడం ప్రారంభించారు. భారతీయుల ఈ భావనలో సరిహద్దులను మార్చే అవకాశాన్ని లండన్ గమనించింది. 1937 ఏప్రిల్ 1న, మొదటి సామ్రాజ్య విభజన అమలులోకి వచ్చింది. ఏడెన్ భారతదేశం నుంచి విడిపోయింది.



### కింగ్ జార్జ్-6 నుంచి వచ్చిన టెలిగ్రామ్‌లో ఇలా ఉంది:

‘దాదాపు 100 సంవత్సరాలుగా బ్రిటిష్ ఇండియన్ పరిపాలనలో భాగంగా ఏడెన్ ఉంది. నా భారత సామ్రాజ్యంతో ఆ రాజకీయ సంబంధం ఇప్పుడు తెగిపోతోంది. ఏడెన్‌కు వలస రాజ్యంలో సుస్థిర స్థానం ఉంటుంది’ అని ఆ టెలిగ్రామ్ పేర్కొంది.




### భారత స్వాతంత్ర్యానికి కొన్ని నెలల ముందు విడిపోయిన గల్ఫ్ దేశాలు

గల్ఫ్ ప్రాంతం మరో దశాబ్దం పాటు భారత ప్రభుత్వ పరిధి లోనే ఉంది. స్వాతంత్ర్యం తర్వాత ‘పర్షియన్ గల్ఫ్’ను భారతదేశం లేదా పాకిస్తాన్‌లో భాగం చేయొచ్చా అని బ్రిటిష్ అధికారులు చర్చిం చారు. ‘గల్ఫ్ అరబ్బుల వ్యవహార బాధ్యతలను భారతీయులు లేదా పాకిస్తానీయులకు అప్పగించడం సరికాదు’ అని అప్పట్లో గల్ఫ్ నివాసి అయిన విలియం హే అన్నారు. బ్రిటిష్ ఇండియా భారతదేశం, పాకి స్తాన్‌గా విడిపోయి స్వాతంత్ర్యం పొందడానికి కొన్ని నెలల ముందు దుబాయ్ నుంచి కువైట్ వరకు గల్ఫ్ దేశాలు ఏప్రిల్ 1, 1947న భారత్ నుంచి విడిపోయాయి. కొన్ని నెలల తర్వాత, భారతదేశం, పాకిస్తాన్ అధికారులు వందలాది రాజసంస్థానాలను కొత్త దేశాలలో విలీనం చేయడం ప్రారంభించినప్పుడు, గల్ఫ్‌లోని అరబ్ దేశాలు ఆ జాబితాలో లేవు. ఎవరూ దీన్ని పట్టించుకోలేదు. 75 సంవత్సరాల తర్వాత కూడా, దాని ప్రాముఖ్యత భారత్‌లో గానీ, గల్ఫ్‌లో గానీ ఎవరికీ పూర్తిగా అర్థం కాలేదు. ఈ చిన్న అధికార బదిలీయే లేకపోతే, ఉపఖండంలోని ఇతర రాజసంస్థానాల తరహాలో పర్షియన్ గల్ఫ్ రెసిడెన్సీ దేశాలు స్వాతంత్ర్యం తర్వాత భారత్ లేదా పాకిస్తాన్‌లో భాగమయ్యేవి.






### బ్రిటిష్ ఇండియా ఆఖరి అవశేషం

బ్రిటిష్ ప్రధానమంత్రి క్లెమెంట్ అట్లీ బ్రిటిష్ భారతదేశంతో పాటు, అరేబియన్ భూభాగాల నుంచి కూడా వైదొలగాలని ప్రతిపాదించినా, దానికి వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో గల్ఫ్‌లో మరో 24 సంవత్సరాలు బ్రిటన్ పాలన కొనసాగింది. అక్కడి ప్రభుత్వం భారత వైస్రాయ్‌కు కాకుండా వైట్‌హాల్‌కు జవాబుదారీగా మారింది. ‘గోవా పోర్చుగీస్ ఇండియా చివరి అవశేషం, పాండిచ్చేరి ఫ్రెంచ్ ఇండియా చివరి భాగంలా, పర్షియన్ గల్ఫ్ అన్నది భారత సామ్రాజ్యం చివరి కోట’ అని గల్ఫ్ స్కాలర్ పాల్ రిచ్ అన్నారు.

హోల్డన్ పర్యటన నాటికి అక్కడ అధికారిక కరెన్సీ భారత రూపాయి. సులభమైన రవాణా మార్గం ‘బ్రిటిష్ ఇండియా లైన్’ (షిప్పింగ్ కంపెనీ), 30 అరేబియా రాజసంస్థానాలను భారత్‌లో కెరీర్ నిర్మించుకున్న ‘బ్రిటిషర్లు’ పరిపాలించారు. బ్రిటిష్ వారు 1971లో సూయజ్‌కు తూర్పున వలస పాలన బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించి గల్ఫ్ నుంచి చివరకు వైదొలగారు.

‘బ్రిటన్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన రోజుల నుంచీ మొదటి సారి, గల్ఫ్ చుట్టూ ఉన్న అన్ని ప్రాంతాలు బ్రిటిష్ జోక్యం, భయం లేకుండా తమ సొంత మార్గాలు వెతుక్కోవడంలో స్వేచ్ఛగా ఉన్నాయి. ఇది బ్రిటిష్ ఇండియా చివరి అవశేషం. ఇది ఇలాగే ఉంటుంది. కొన్ని సంవత్సరాలుగా కాస్త అస్పష్టంగా, మరికాస్త ఆకర్షణీయంగా ఉన్న పరిస్థితులు ఇప్పుడు ముగిసిపోయాయి’ అని డేవిడ్ హోల్డన్ రాశారు.



### దిల్లీ కేంద్రంగా పాలన

సామ్రాజ్యం పతనం తర్వాత పుట్టుకొచ్చిన జాతీయ భావనలతో, బ్రిటిష్ ఇండియాతో తమ సంబంధాలను చెరిపివేయడంలో గల్ఫ్ దేశాలు సక్సెస్ అయ్యాయి. బహ్రెయిన్ నుంచి దుబాయ్ వరకు, చాలామందికి బ్రిటన్‌తో గత సంబంధాలు గుర్తున్నాయి. కానీ దిల్లీ నుంచి సాగిన పరిపాలన తెలియదు. ఊహాత్మక కథనాలతో రాజ వంశాల ఉనికి ముందు తరాలకు తెలుస్తోంది. అయితే గల్ఫ్ దేశాల్లో సామాజిక, ఆర్థికపరంగా జరిగిన భారీ మార్పుల తర్వాత కూడా వ్యక్తిగత జ్ఞాపకాలు మిగిలే ఉన్నాయి. గల్ఫ్ స్కాలర్ పాల్ రిచ్ 2009లో ఖతార్‌కు చెందిన ఒక వృద్ధుడితో మాట్లాడారు. ‘ఏడు లేదా ఎనిమిదేళ్ల చిన్న వయసులో, బ్రిటిష్ ఏజెంట్ అయిన భారతీయ ఉద్యోగి నుంచి నేనెప్పుడూ చూడని ఆరెంజ్ పండును దొంగిలించినందుకు నన్ను కొట్టారు. నాకు ఆ కోపం చాలా కాలం ఉంది’ అని ఆ వృద్ధుడు చెప్పారు. తన యవ్వనంలో భారతీయులంటే ఎంతో క్రేజ్ ఉండేదని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయి వారు గల్ఫ్‌కు కార్మికులుగా వస్తుండడం చాలా సంతోషం కలిగించిందని చెప్పారు. ఒకప్పుడు భారత సామ్రాజ్యంలో ఏ మాత్రం ప్రాధాన్యత లేని ప్రాంతంగా ఉండే దుబాయ్, ఇప్పుడు పశ్చిమాసియాలో దేదీప్య మానంగా వెలిగిపోతోంది. హైదరాబాద్, జైపూర్ లేదా బహావల్పూర్ లాగా, చమురు సంపన్నమైన గల్ఫ్ భారత్ లేదా పాకిస్తాన్‌లో అంతర్భాగంగా ఉండేదని అక్కడ నివసించే మిలియన్ల మంది భారతీయులు లేదా పాకిస్తానీయులలో చాలామందికి తెలియదు. సామ్రాజ్యం మసకబారుతున్న సమయంలో ఒక అధికారపరమైన నిర్ణయం ఆ సంబంధాన్ని తెంపేసింది. అప్పటి జాడలు మాత్రమే మిగిలున్నాయి.

శామ్ డాల్రింపుల్

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

## సుపరిపాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

* ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజాసేవకు తగ్గేదేలేదు
* శాసనసభ్యులు గొండు శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సుపరిపాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధి హయాతినగరం 43, 44, 45 వార్డులలో ప్రతీ ఇంటికీ వెళ్లి, సమస్యలను తెలుసుకుంటూ, సత్వరమే కొన్ని సమస్యలకు పరిష్కారం చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో అడుగడుగునా నీరాజనం పడుతున్న ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ పౌరుని సమస్యా తీర్చాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నానని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తగ్గేదేలేదని, వాటిని పట్టించుకోనని అన్నారు. ప్రజాదర్బార్‌లో వినతులు, సుపరిపాలన తొలి అడుగులో సమస్యలు పరిష్కారమే తన ముందున్న సవాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, భావితర నేత నారా లోకేష్ ఆదేశాల మేరకు చేపట్టిన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధి హయాతినగరం వార్డులలో పార్టీ శ్రేణులతో కలసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు అందరికీ అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్ష బృందం, హయాతినగర వార్డు ఇన్‌ఛార్జిలు, బూత్ ఇన్‌ఛార్జి నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## నగరంలో కుక్కలు స్వైరవిహారం





❖ అధికారుల చర్యలు శూన్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



నగరంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు కుక్కల నియంత్రణకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల పేరుతో ప్రతి ఏడాది రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా ఎందుకూ అక్కరకు రావడం లేదు. కుక్కలకు కుటుంబ నియంత్రణ అపరేషన్లు చేస్తున్నట్టు అధికారుల ప్రకటనలు వట్టి మాటలేనని తేలిపోయింది. నగరంలోని 50 వార్డుల్లోనూ కుక్కల బెడద పెరగడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. నగరంలోని కత్తెరవీధి రాజ రాజేశ్వరి పీఠం, వేదమాత హెచ్‌పీ గ్యాస్ వద్ద ఏజెన్సీ కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయని స్థానికులు ఆందోళనలో ఉన్నాయి. కుక్కలు గుంపులుగా పగటిపూటే పాదచారులు వెంటపడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళల్లో వాహనాలపై వెళ్తున్న వారిని తరుముతున్నాయని చెబుతున్నారు. రాజేశ్వరీ పీఠం రోడ్డు మీదుగా విద్యార్థులు సమీపంలో ఉన్న రెండు పాఠశాలలకు రాకపోకలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆ సమయంలో రోడ్డు మీదు కుక్కలు గుంపులుగా ఉంటుండడంతో విద్యార్థులు భయోందోళనకు గురవుతున్నారు. దీనిపై నగరపాలక సంస్థ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





## పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



(సత్యంన్యూస్, పలాస)

అండమాన్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు బయ్య కృష్ణారావు తన తల్లిదండ్రులు బొడ్డేశు, సావిత్రమ్మల జ్ఞాపకార్థం రూ. 15వేలు విలువ గల ఎప్సన్ ప్రింటర్ పల్లిసారథి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బహూకరించారు. పాఠశాల విద్యార్థుల అంతర్గత పరీక్షల నిర్వహణ, ఇతర అవసరాలకు ఇబ్బంది కలగకుండా ఉండడానికి దీనిని అందజేసినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు వై.కాంతారావు మాట్లాడుతూ పాఠశాల విద్యాభివృద్ధికి సర్పంచ్ బత్తిని కుసుమ హేమంత్‌రావు, స్కూల్ మేనేజ్మెంట్ చైర్‌పర్సన్ దున్న కవితరమేష్‌లు చొరవ తీసుకుని గ్రామపెద్దల సహకారంతో పాఠశాల అభివృద్ధికి దోహదపడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుంట కోదండరావు, కె.మాధవరావు, ఎం.హరనాథ్, ఎన్.విష్ణుమూర్తి, ఎస్.పాపారావు, బి.అన్నపూర్ణ, ఉపాధ్యాయేతర సిబ్బంది సీతమ్మ నాగభూషణరావు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## 21 మున్సిపాలిటీల్లో త్వరలో ఎన్నికలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



విలీన గ్రామాల సమస్యలు, కోర్టు కేసుల వల్ల రాష్ట్రంలో ఎన్నికలు జరగని 21 మున్సిపాలిటీల్లో మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహిస్తామని మున్సిపల్ శాఖామంత్రి నారాయణ ప్రకటించారు. ఎన్నికలు జరగకపోవడం వల్ల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలవ్వక అభివృద్ధి జరగడంలేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్నే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళితే కోర్టులో కేసులు పరిష్కరించి ఎన్నికలు జరిగేవిధంగా చర్యలు తీసుకోమన్నారని, మూడు నెలల్లో ఎన్నికలకు వెళ్తామని మంత్రి నారాయణ బుధవారం తెలిపారు.

## ఎన్నికలు మున్సిపాలిటీకి.. కార్పొరేషన్లకు కాదు!

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నిక జరగలేదు. ఈలోగా 2014లో టీడీపీ ప్రభుత్వం, 2019లో వైకాపా అధికారంలోకి వచ్చి వార్డుల పునర్విభజన, డివిజన్ల సంఖ్య మార్పు, రోస్టర్‌ను సిద్ధం చేసింది తప్ప కోర్టులో కేసులను మాత్రం విత్‌డ్రా చేయించలేకపోయింది. ఏడు విలీన పంచాయతీలతో కలిపి కార్పొరేషన్‌కు ఎన్నికల నిర్వహించడమే గత ప్రభుత్వ స్టాండ్‌గా ఉండేది. అందుకే కోర్టు కేసు తేలాక ఏడు పంచాయతీలతో కూడిన కార్పొరేషన్‌కు ఎన్నికలు పెట్టాలని భావిస్తూవచ్చింది. తెలుగుదేశం మాత్రం పంచాయతీలను విడగొట్టి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరపాలని చూస్తుంది. కాకపోతే ఇందుకు వైకాపా చేసిన చట్టం అడ్డొస్తుంది. మరోవైపు ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన తోటపాలెం, కుశాలపురం పంచాయతీలను శ్రీకాకుళం నగర కార్పొరేషన్ నుంచి విడగొట్టాలంటూ ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్ ప్రభుత్వాన్ని ఒప్పించారు. ఇందుకు సంబంధించి కేబినెట్ తీర్మానం మాత్రమే పెండింగ్‌లో ఉంది. ఇది పూర్తయితే ఐదు విలీన పంచాయతీలతో ఎన్నికలకు వెళ్లాల్సివుంటుంది. విజయవాడలో ఎన్ఈఆర్ పని పూర్తయితే శ్రీకాకుళం నియోజకవర్గంలో ఉన్న ఐదు పంచాయతీల టీడీపీ నేతలు మంత్రి నారాయణను కలవడానికి సిద్ధంగా ఉన్నారు. కాబట్టి చట్టం చేసిన స్థానిక సంస్థలైన నగర కార్పొరేషన్లకు కూడా మూడు నెలల్లో ఎన్నికలు జరుపుతామని నారాయణ ఎక్కడా ప్రకటించలేకపోయారు.

## విద్యారంగ సమస్యలపై ఛలో కలెక్టరేట్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం జిల్లాలో ఛలో కలెక్టరేట్ నిర్వహించారు. ఇందులో సుమారు 300పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చి మూడు నెలలు కావస్తున్న డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించలేదన్నారు. డిగ్రీలో డబల్ మేజర్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు డబల్ మేజర్ విధానాన్ని తెస్తామని, పీజీ విద్యార్థులకు జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని, ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచుతామని ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గిస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా అవి నేటికీ అమలు కావడం లేదన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి ఈ.గనేష్, జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ రాజు, జిల్లా కమిటీ సభ్యులు జయరాం, టౌన్ కమిటీసభ్యులు కార్తీక్, శివ, నందిని, నందు, శ్రీకాకుళం టౌన్ కాలేజ్ కమిటీ సభ్యులు మంజుల, సౌజన్య, సంజన తదితరులు పాల్గొన్నారు.




## హిరమండలంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పాతపట్నం నియోజకవర్గం, హిరమండలం మండలం ధనుపురంలో బుధవారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ముఖ్య అతిథిగా పాల్గొని కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. చంద్రబాబు నాయుడు ప్రజలకు సూపర్ సిక్స్ అంటూ చేసిన అబద్ధపు హామీలు ఇచ్చి చేసిన ప్రజలను మోసం చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పేదల సంక్షేమం కోసం ఎప్పుడూ పాటు పడేవారన్నారు.



## నగిరి నాగరాజుకు అభినందనల వెల్లువ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కడపలో జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీల్లో నగిరి నాగరాజు రెండో స్థానం కైవసం చేసుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కుశాలపురం, జిల్లా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, జనసేన ఎచ్చెర్ల నియోజకవర్గం సీనియర్ నాయకులు, బాడాన వెంకట జనార్ధనరావు (జన) రాజుకు ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. అనంతరం స్టార్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ వి.విజయకుమార్‌తో కలసి మాట్లాడుతూ బాడీ బిల్డర్స్‌కు, శ్రీకాకుళం ఒక వేదికగా నిలవాలని, అందుకు తమ సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. తొమ్మిదవ వార్డు టీడీపీ ఇంచార్జి గండేపలి కోటేశ్వరరావు, నర్సింగ్ అలినగరం ఎంపీటీసీ, సీనియర్ బాడీబిల్డర్ బలగ. ప్రసాద్, బాక్సర్ కుమార్ శంకర్ ఆముదాలవలస ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. అలాగే జిల్లాకు మంచి క్రీడాకారులను అందజేస్తున్న స్టార్ బాడీబిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ వి.విజయకుమార్ కష్టానికి, ఈవిజయాలు ప్రతిఫలమని కొనియాడారు.

## చంద్రబాబువన్నీ దొంగ హామీలే

(సత్యంన్యూస్, నరసన్నపేట)


ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా వైకాపా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ దుయ్యబట్టారు. బుధవారం ఉర్లాం సన్ ఫంక్షన్ ప్లాజాలో జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. ఇప్పుడు సూపర్‌సిక్స్ గూర్చి మాట్లాడడానికి లేదన్నట్టుగా చంద్రబాబు మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రజల్లో చంద్రబాబును నమ్మి మళ్లీ మోసపోయామని ప్రజల్లో భావన మొదలైందన్నారు. సంక్షేమ పథకాల వారధి సారధి.. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పర్యటనలకు వచ్చిన ప్రజాదరణ దీనికి ఉదాహరణని చెప్పుకొచ్చారు. వైకాపా కార్యకర్తలు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అరాచకాల గూర్చి ప్రజలకు చెప్పాలన్నారు. యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వం ప్రజలకు నయవంచన చేసిందన్నారు. ప్రజల్లో ఇప్పటికే తిరుగుబాటు మొదలైందన్నారు. గ్రామాల్లో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలన గూర్చి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళీధర్, జెడ్పీటీసీ చింతు రామారావు, మండల అధ్యక్షులు లుకలాపు రవి, నాయకులు రాజపు అప్పన్న, కేసీహెచ్ గుప్తా, పుట్ట ఆదిలక్ష్మి, గురుబెల్లి వెంకటరమణి, బగ్గు రమణయ్య, నియోజకవర్గ సురంగి నర్సింగరావు, బుద్దల రాజశేఖర్, అంపోలు సునీత, పొట్నూరు సాయి ప్రసాద్, బబ్బోది ఈశ్వరరావు, వైశ్యరాజ్ కేశవరాజు, పోలాకి నరసింహమూర్తి, నడిమింటి శాంతారావు, సతివాడ రామినాయుడులు పాల్గొన్నారు.



## వంశధార జలాలను అందించాలి

(సత్యంన్యూస్, పలాస)

వంశధార జలాలను పలాస నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి అందించాలని కోరుతూ వంశధార సాగు జలాలు సాధన కమిటీ పలాస, ఇచ్ఛాపురం ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బెందాళం అశోక్‌లను బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ వంశధార సాగునీటి జలాలు ఇచ్ఛాపురము వరకు అందిస్తామని ఎన్నికలకు ముందు నాయకుల వాగ్దానాలు చేసి ఎన్నికలు అయ్యాక పట్టించుకోవడం లేదన్నారు. సుమారుగా 40 ఏళ్లుగా ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార ప్రాజెక్టుకు సమస్యగా ఉన్న నేరడి బ్యారేజీ అంశం ఒడిస్సా రాష్ట్ర సమస్యగా ఉందన్నారు. దీని పరిష్కారం ప్రభుత్వానికి పెద్ద సమస్య కాదని, పరిష్కారం చేయలేని పరిస్థితిలో ప్రభుత్వాలు వున్నాయంటే రైతుల పట్ల ఎంత నిర్లిప్తతో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో మార్పు మన్మధరావు, ధర్మార్పు వెంకట్రావు, కొర్ల హేమారావు చౌదరి, నల్ల హడ్డి మాస్టర్, గుంటూ లోకనాథం, శశిధర్ వర్మ, పండిట్ మాస్టర్, దుంపల వైకుంఠరావు, ఉగ్రిపల్లి సోమనాదం, కొవ్వూరు దశరథి, దేవాడ నారాయణరావు, వాయలపల్లి పాపారావు, వాయలపల్లి రమణ, కొర్నాన గంగాధర్ మాస్టర్ గారు, నర్సింగ్నాథ్ సాబుతో వెదుళ్ళ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు సహాయం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు దివంగత మంగు తిరుమలరావు చారిటబుల్ ట్రస్టు తరపున పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఆయన కుమార్తె మంగు వేదవల్లి బుధవారం పంపిణీ చేశారు. శ్రీకాకుళం పట్టణంలోని ట్రస్టు కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ క్రియాశీలక రాజకీయాల్లో మంగు తిరుమలరావు చురుకైన పాత్ర పోషించారన్నారు. పేదలకు అండగా నిలబడుతూ తిరుమలరావు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ట్రస్టు వ్యవస్థాపకురాలు మంగు వేదవల్లి మాట్లాడుతూ తన తండ్రి మంగు తిరుమలరావు ఆలోచనలకు అనుగుణంగా ఆయన 70వ జయంతి పురస్కరించుకొని పేద కుటుంబాలకు కొంతమేర సహకారం అందించామన్నారు. ఆడపిల్లలకు విద్య ఆవశ్యకతను ఎల్లప్పుడూ తన తండ్రి బోధించారన్నారు. రానున్న రోజుల్లో ట్రస్టు తరపున పేదలకు సహకారంతో పాటు బాలికా విద్య పట్ల మరిన్ని కార్యక్రమాలు చేస్తామని వేదవల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉర్లం శివతేజ, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.




కేజీబీవీ కొత్తపాలెంస్కూల్లో యూత్ స్కిల్స్‌డేని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పొల్లాయి లక్ష్మీదేవి తెలియజేశారు. విజేతలకు బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్య శిక్షకురాలు బావన సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.